RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 363 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 7-11- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 363 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 7-11-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

విజయవాడలో కృష్ణా నదిపై మరో రైల్వే వంతెన..

రూ.5,858 కోట్ల ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధం

విజయవాడలో తగ్గనున్న రైళ్ల నిరీక్షణ..

కృష్ణా నదిపై కొత్త వంతెన

బల్లార్ష-గూడూరు ప్రాజెక్టులో ముందడుగు..

విజయవాడలో కొత్త రైల్వే బ్రిడ్జి

నదిపై 1.30 కిలోమీటర్ల

పొడవుతో మూడో వంతెన



విజయవాడ, సిటిజన్ టైమ్స్

విజయవాడలో రైల్వే ట్రాఫిక్ రద్దీని తగ్గించే దిశగా రైల్వే శాఖ కీలక ముందడుగు వేసింది. నగరంలో కృష్ణా నదిపై కొత్తగా మరో రైల్వే వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. బల్లార్ష-ఖాజీపేట-విజయవాడ-గూడూరు మధ్య నిర్మిస్తున్న నాలుగో రైల్వే లైన్ ప్రాజెక్టులో భాగంగా ఈ వంతెనను నిర్మించ నున్నారు. ఈ మేరకు రూ.5,858 కోట్ల అంచనాలతో రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రైల్వే బోర్డుకు సమర్పించారు. విజయవాడ-గూడూరు మధ్య 293 కిలోమీటర్ల మేర

తరువాయి 2లో..





ఎన్నికల కంటే.. ప్రజా సమస్యలే ముఖ్యమని భావించా...

బాపట్ల, గుంటూరు, సిటిజన్ టైమ్స్

తుపాన్ల వల్ల కోస్తా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం.. ఏరియల్ సర్వే నిర్వహించారు. బాపట్ల, గుంటూరు జిల్లాల పర్యటనకు వెళు న్న సమయంలో హెలికాప్టర్ ద్వారా పంట నష్టాన్ని పరిశీలించారు. హెలికాప్టర్‌లో సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో దిగి.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు చేరుకున్నారు. మురసు తుపానుకు గండ్లు పడిన డ్రెయిన్‌ను పరిశీలించి.. నీటిపారుదలశాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి

తరువాయి 2లో..

బురదలో, పాలం గట్లపై సీఎం చంద్రబాబు..

క్షేత్రస్థాయిలో రైతులకు అండ..!

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయి పర్యటన

రాత్రి పగలు సమీక్షలు, టెలికాన్ఫరెన్సులతో యంత్రాంగాన్ని అప్రమత్తం

తుఫాను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ, సహాయక చర్యల పర్యవేక్షణ

చరిత్రను తిరగరాసే దిశగా డెమోక్రాట్ల అడుగులు




న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

చరిత్రను తిరగరాసే దిశగా డెమోక్రాట్లు అడుగులు వేస్తున్నారు. అమెరికా ప్రజలు ఆ పార్టీకి భారీ మెజారిటీని

తరువాయి 2లో..

దిల్లీలో వాయు కాలుష్యం.. అమల్లోకి మూడో దశ ఆంక్షలు

తరువాయి 2లో..



కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్..

రేపటి నుంచి మూడ్రోజుల పర్యటన

సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు

సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు

పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు

కొడంగల్, సిటిజన్ టైమ్స్

తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నవంబర్ 7, 8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను

తరువాయి 2లో..



భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం..

'ప్రళయ్' పరీక్ష సక్సెస్

ఒడిశా తీరంలో ప్రయోగాన్ని నిర్వహించిన డీఆర్‌డీవో

స్వదేశీ రక్షణ సామర్థ్యంలో మరో మైలురాయిగా అభివర్ణన

గత నెలలో హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ పరీక్ష కూడా సక్సెస్

21 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించి సత్తా చాటిన హెచ్‌ఏపీఎస్

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే 'ప్రళయ్' క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలో గురువారం ఉదయం 11:10 గంటలకు ఈ ప్రయోగాన్ని

తరువాయి 2లో..



డీఎస్సీలో కనీస అర్హత మార్కులు రావాల్సిందే

రాతపరీక్ష, టెట్ కలిపాక ఓసీలకు 40%, బీసీలకు 35%, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30%

క్రీడా కోటా పోస్టులకూ వర్తింపు -ఉద్యోగాల ప్రాధాన్య ఎంపికకు రెండు సార్లు అవకాశం

ప్రత్యేక ఉపాధ్యాయులకు ఏడాదికి 0.5 మార్కుల చొప్పున వెయిటేజీ

క్రీడా కోటాలో దరఖాస్తుకు ముందు శాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి -పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు

అమరావతి, సిటిజన్ టైమ్స్

రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహిస్తున్న డీఎస్సీ-2026లో పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు చేసింది. కనీస అర్హత మార్కుల నిబంధనను తెచ్చింది. క్రీడా కోటా అభ్యర్థులు సైతం డీఎస్సీ రాయడంతో పాటు కనీస మార్కులు సాధించాలని నిర్దేశించింది. రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 ప్రకారం 95% పోస్టులు స్థానిక అభ్యర్థులకు, మిగిలిన 5% ఓపెన్ కాంపిటీషన్ కింద ఉంటాయి. ఈ 5% పోస్టులను స్థానిక, స్థానికేతర అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ఇస్తారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, టీజీటీ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్షకు 80 మార్కులు, టెట్‌కు 20 మార్కుల

వెయిటేజీ ఉంటుంది. ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్, పీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులకు 100 మార్కులకు రాతపరీక్ష ఉంటుంది. వీటికి టెట్ అర్హత అవసరం లేదు. లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 2017 నుంచి నిర్వహించిన సంబంధిత భాషా ప్రత్యేక టెట్ మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అంతకుముందు నిర్వహించిన ఉమ్మడి టెట్ మార్కులను పరిగణించరు.

కేటగిరీల వారీగా కనీస మార్కులు

కొత్త నిబంధనల ప్రకారం ఓసీ అభ్యర్థులు 40% కనీస అర్హత మార్కులు సాధించాలి. ఎస్ఏ, ఎస్జీటీ, టీజీటీ, ప్రత్యేక విద్య పోస్టులకు రాతపరీక్ష(80),

తరువాయి 2లో..

'మురసు' పెను విలయం

ఏపీలో 8 మంది బలి, రూ.1918 కోట్ల నష్టం

లక్షలాది హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు ధ్వంసం

సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశం

నేడు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్న సీఎం

యుద్ధప్రాతిపదికన విద్యుత్, రహదారుల పునరుద్ధరణ పనులు

అమరావతి, సిటిజన్ టైమ్స్



ఆంధ్రప్రదేశ్‌ను 'మురసు' తుపాను పెను విపత్తులో ముంచేసింది. మంగళవారం తీరం దాటిన ఈ తుపాను ధాటికి రాష్ట్రవ్యాప్తంగా 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.1,918.55 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. బాపట్ల జిల్లాలో ఐదుగురు, గుంటూరు జిల్లాలో ఇద్దరు, పల్నాడు జిల్లాలో ఒకరు మరణించినట్లు అధికారికంగా ధ్రువీకరించారు. తుపాను కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. సుమారు 1,86,063

తరువాయి 2లో..

ఎడిటోరియల్

ఇక.. 100 పర్సంట్ దూకుడే.. !

స్థానిక ఎన్నికల్లో 94 శాతానికి పైగా విజయాలు సాధించామని చెబుతున్న కూటమి పార్టీలు.. ఇదే సమన్వయాన్ని కొనసాగించాలని భావిస్తున్నాయి. పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. కూటమి పార్టీల దూకుడు మరింత పెరుగుతుందా? వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీలు మరింత సమన్వ యంతో ముందుకు సాగుతాయా? తదుపరి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నిర్ణయాలు ఉంటాయా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీలు సంయుక్తంగా 2024లో విజయం దక్కించుకున్నాక.. రెండున్న రేళ్ల సమయంలో వచ్చిన స్థానిక ఎన్నికల్లోనూ దాదాపు అంతకు మించి అన్న తరహాలో విజయాన్ని కైవసం చేసుకు న్నాయి. తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల్లో 94 శాతాన్ని మించిన గెలుపును పార్టీలు ఆశ్వాదిస్తున్నాయి. ఇప్పుడు పరిషత్ ఎన్నికలు తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే తరహాలో విజయం దక్కించుకునేందుకు కూటమి పక్షాలు మరోసారి ప్రయత్నాలు ముమ్మరంచేస్తున్నాయి. ఇదే విషయాన్ని తాజాగా టీడీపీ అధినేత చంద్ర బాబు తేల్చి చెప్పారు. పరిషత్ ఎన్నికల్లోనూ కూటమిదే పైచేయి కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు. దీని తర్వాత.. వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికలు రానున్నాయి. ఇవి పార్టీ జెండాలకు అతీతంగా జరిగినప్పటికీ.. పంచాయతీల్లోనూ ప్రభంజనం కొనసాగేలా కూటమి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. మొత్తంగా చూస్తే.. ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో సాధించిన విజయం మాత్రం కూటమికి ఎనలేని ఉత్సాహాన్ని.. పెంచే సింది. దీనిని వచ్చే ఎన్నికల వరకు అంటే.. 2029 ఎన్నికల వరకు కూడా కాపాడుకునే దిశగానే అడుగులు వేయాల న్నది చంద్రబాబు చెబుతున్న మాట. ఈయన మాత్రమే కాదు.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం.. ఇదే మాట చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తి కనిపించాలని ఇటు ప్రజలకు, అటు నాయకులకు కూడా పవన్ సూచించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నదే వారి లక్ష్యంగా ఉంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మరోసారి విజయం దక్కించుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నది ప్రస్తుతం ముందున్న లక్ష్యం. దీనిని సాధించేందుకు ఇప్పుడున్న స్ఫూర్తినే కొనసాగిస్తే బెటర్ అన్న భావన కూడా ఉంది. సో.. మొత్తంగా 100 శాతం స్ట్రయిక్ రేట్ కొనసాగిస్తూ.. వచ్చే అసెంబ్లీ పోరులోనూ వైసీపీని నామరూపాలు లేకుండా చేయాలన్న వ్యూహాత్మక ఆలోచనను ఇప్పటి నుంచే కార్యాచరణలోకి తీసుకురానున్నారు. దీనికి సంబంధించి కూడా త్వరలోనే నిర్ణయాలు ఉంటాయని.. బలమైన పోటీ ఇవ్వడంతోపాటు.. వైసీపీ ఉనికిని కూడా లేకుండా చేయాలన్నది కూటమి లక్ష్యం.

ఎన్నికల కంటే.. ప్రజా సమస్యలే

ముఖ్యమని భావించా...

చేరుకుని దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. డ్రెయిన్లకు గండ్లు పడిన కారణంగా నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

అనంతరం సీఎం మాట్లాడుతూ.. "తుపాను కారణంగా గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టం తగ్గించేందుకు ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. పంటల బీమా కట్టాలని ప్రతి రైతును కోరుతున్నాం. మొన్నటి వరకు ఎల్‌నినోతో ఇబ్బందులు.. ఇప్పుడు తుపాన్లు దెబ్బతీశాయి. వరుసగా రెండు తుపాన్లు రావడం చరిత్రలో మొదటి సారి. అర్నబ్, మురసు వల్ల సంభవించిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నాం. తుపాన్ల ప్రభావితంపై కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాం.. ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందేంత వరకూ పని చేస్తాం. నల్లమడ డ్రైన్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం. వైకాపా ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. గత పాలనలో తుపాన్లు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి...పరామర్శించారు. ఎన్నికల కంటే.. ప్రజా సమస్యలే ముఖ్యమని భావించి తుపాన్ల సమయంలో పనిచేశాం. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక.. అన్ని విషయాలు మాట్లాడతాం. తీర ప్రాంతాలను తుపాన్లు దెబ్బతీస్తే... రాయలసీమ ప్రాంతాన్ని ఎల్‌నినో ఇబ్బంది పెట్టింది. రాయలసీమలో కూడా కరవును అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించాయి. తీర ప్రాంతంలో నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతుంటే... రాయలసీమ ప్రాంతం నీటి కొరతను ఎదుర్కొంటోంది. అందుకే నీటి భద్రతకు.. సమర్థ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం" అని సీఎం వివరించారు.

నీట మునిగిన పొలాల్లో నడుస్తూ, పంట నష్టాన్ని స్వయంగా అంచనా

సచివాలయంలో సమీక్షలు, టెలికాన్ఫరెన్సులకే పరిమితం కాకుండా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పొలం గట్లపైకి, పంట బోదెల మీదకు వెళ్లి తుపాను సృష్టించిన బీభత్సాన్ని స్వయంగా పరిశీలించారు. రైతు కష్టం తెలిసిన నాయకుడిగా, అన్నదాతల కన్నీళ్లు తుడిచేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భారీ వర్షాలకు నీట మునిగి కళ్లెదుటే పంట నాశనమవుతుంటే గుండెలు బాదుకుంటున్న కర్షకులకు అండగా నిలిచారు. ధ్వంసమైన రహదారుల్లో, బురదమయమైన పొలాల్లో నడుస్తూ, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను హెచ్చరికలు జారీ అయిన అక్టోబరు 27వ తేదీ నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తమయ్యారు. 'అర్నబ్', 'మురసు' తుపానుల సమయంలో రాత్రిళ్లు కూడా మేల్కొని కలెక్టర్లు, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్సులు నిర్వహించారు. వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ముంపునకు గురయ్యే ప్రాంతాలు, ప్రజల తరలింపు, సహాయక చర్యల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించారు. రాష్ట్ర యంత్రాంగాన్ని సమన్వయం చేయడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన సహాయం కోసం కృషి చేశారు. ఒకవైపు ఉన్నతాధికారులతో సమీక్షలు, మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలతో విపత్తు నిర్వహణలో తనదైన మార్క్ చూపించారు. ఆయన ముందుచూపు, సత్వర స్పందన వల్ల పెను నష్టాన్ని నివారించడంలో యంత్రాంగం సఫలమైంది.

క్షేత్రస్థాయిలో పర్యటనలతో వాస్తవాల పరిశీలన

అధికారులు ఇచ్చే నివేదికలతో సరిపెట్టకుండా, వాస్తవ నష్టాన్ని కళ్లారా చూసేందుకు చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇటీవలి 'అర్నబ్' తుపాను సమయంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం వరకు దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించారు. తాజాగా 'మురసు' తుపాను కారణంగా అతలాకుతలమైన బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి, గుంటూరు జిల్లాలోని రేటూరు గ్రామాల్లో పర్యటించారు. నీట మునిగిన వరి పొలాల్లోకి వెళ్లి, పంట బోదెల వద్ద నిలబడి నష్టాన్ని అంచనా వేశారు. బురదలో, పొలం గట్లపై తిరిగి పంటలు దెబ్బతిన్న వైనాన్ని కళ్లారా చూశారు. పర్యటనలో భాగంగా, రైతుల వద్దకే నేరుగా వెళ్లి వారి ఆవేదనను ఓపికగా విన్నారు. ఎన్ని ఎకరాల్లో పంట నష్టపోయారు, ఎంత పెట్టుబడి పెట్టారు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం ఆశిస్తున్నారనే వివరాలను వారినే అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నీటిపాలైన రైతుల బాధను చూసి చలించిన ఆయన, అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తుల వల్ల రైతులు కుంగిపోకుండా, తిరిగి ధైర్యంగా వ్యవసాయం చేసుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం.. 'ప్రళయ్' పరీక్ష సక్సెస్

నిర్వహించినట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "వినియోగదారుల మూల్యాంకన పరీక్షల్లో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. నిర్దేశించిన అన్ని లక్ష్యాలను ఇది విజయవంతంగా పూర్తి చేసింది. వివిధ రేంజ్ సాధనాల ద్వారా సేకరించిన డేటా ఈ విషయాన్ని ధ్రువీకరించింది" అని ఆయన తెలిపారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ విజయం మరో ముఖ్యమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. డీఆర్‌డీవో గత నెలలో కూడా మరో ఘనతను సొంతం చేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ (హెచ్ఏపీఎస్) విమాన ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రకటించింది. ఈ ప్రయోగంలో భాగంగా హెచ్ఏపీఎస్ 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, సుదీర్ఘ సమయం పాటు స్ట్రాటోస్ఫియర్‌లో ప్రయాణించే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రయోగాత్మక విమానం సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. ఆ తర్వాత సుమారు 20 కిలోమీటర్ల ఎత్తులో 30 నిమిషాలకు పైగా నిలకడగా ప్రయాణించింది. నిరంతర నిఘా, కమ్యూనికేషన్లు, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలకు స్ట్రాటోస్ఫియర్ ఎంతో అనుకూలమైన ప్రాంతం కాగా, ఆ ఎత్తులో పనిచేసే సామర్థ్యాన్ని ఈ వ్యవస్థ నిరూపించింది. ప్రయోగ సమయంలో ఎయిర్‌బోర్న్ ప్లాట్‌ఫామ్ నుంచి గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు రియల్ టైమ్ వీడియో, వాహన పనితీరు డేటా నిరంతరం ప్రసారమైంది. ఈ వ్యవస్థలో ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్, జీపీఎస్ రిసీవర్, ఆన్‌బోర్డ్ కెమెరాలు, ఎత్తును నియంత్రించే యంత్రాంగాలు వంటి అనేక పరికరాలను అమర్చారు. ఈ ఉప వ్యవస్థలన్నీ మిషన్ అంతటా సక్రమంగా పనిచేశాయని అధికారులు తెలిపారు. భారత వైమానిక దళం, సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తీనెస్ అండ్ సర్టిఫికేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి పలు ఏజెన్సీల సమన్వయంతో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు.

డీఎస్సీలో కనీస అర్హత మార్కులు రావాల్సిందే

టెట్ వెయిటేజీ(20) కలిపిన తర్వాత ఓసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారికి 40%, బీసీలకు 35%, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30% కనీస మార్కులు రావాలి. ఇంతకంటే తక్కువొస్తే అనర్హులు. పోస్టులు మిగిలిపోయినా అర్హత సాధించని వారికి అవకాశమివ్వరు. క్రీడా కోటాలోనూ కనీస మార్కులు సాధించిన వారే అర్హులవుతారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్, పీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులకు రాతపరీక్ష(100) మార్కుల్లో కనీస అర్హత తప్పనిసరి. ఈ కేటగిరీలోనూ క్రీడాకోటా అభ్యర్థులకు కనీస మార్కుల నిబంధన వర్తిస్తుంది.

ప్రత్యేక టీచర్ల సర్వీసుకు వెయిటేజీ

ఐఈఆర్టీ, ఐఈడీఎస్ఎస్, తితిదే సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కేజీబీవీ పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులుగా పనిచేసిన వారికి సర్వీసు ఆధారంగా వెయిటేజీ ఇస్తారు. ఒక్కో ఏడాది సర్వీసుకు 0.5 మార్కుల చొప్పున గరిష్ఠంగా 5మార్కులు కేటాయిస్తారు. ఏడాదిలో ఆరు నెలలకు మించి పనిచేస్తే ఒక ఏడాదిగా పరిగణిస్తారు. ఈ వెయిటేజీ కలిపినా మొత్తం మార్కులు 100 దాటకుండా చూస్తారు. డీఎస్సీలో కనీస అర్హత మార్కులు సాధించిన వారికే ఈ వెయిటేజీ వర్తిస్తుంది.

ప్రాధాన్య ఐచ్ఛికాలు మార్చుకోవచ్చు

అభ్యర్థులు తమ అర్హతలను బట్టి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలోనే పోస్టులు, యాజమాన్యాల వారీగా ప్రాధాన్య క్రమాన్ని తప్పనిసరిగా పేర్కొనాలి. ఆ తర్వాత ప్రాధాన్య ఐచ్ఛికాలను మార్చుకోవడానికి మెరిట్ జాబితా ప్రకటించాక వారం రోజుల గడువిస్తారు. గత డీఎస్సీలో దరఖాస్తు సమయంలోనే పోస్టుల ప్రాధాన్య ఐచ్ఛికాల నమోదుకు అవకాశమిచ్చారు. ఆ తర్వాత ఎడిట్ ఆప్షన్ లేక కొందరు అభ్యర్థులు ఉన్నత పోస్టులకు ఎంపికైనా ప్రాధాన్య ఐచ్ఛికం ఇవ్వనందున అవకాశాన్ని కోల్పోయారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదులు వచ్చినందున.. ఈసారి మార్పు చేశారు.

క్రీడా కోటాకు ప్రత్యేక నిబంధనలు

క్రీడల కోటాలో దరఖాస్తు చేసేవారు ముందుగా ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) క్రీడా యాప్/పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అక్కడ ఇచ్చే రిజిస్ట్రేషన్ గుర్తింపు నంబరును డీఎస్సీ దరఖాస్తులో నమోదుచేయాలి. క్రీడా యాప్/పోర్టల్‌తో పాఠశాల విద్యాశాఖ దరఖాస్తు పోర్టల్ అనుసంధానమై ఉంటుంది. యాప్‌లో నమోదుచేసిన క్రీడా సర్టిఫికెట్లలో ఏవైనా మూడు అత్యున్నతమైనవి దరఖాస్తు సమయంలో ఎంచుకోవాలి. యాప్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని సర్టిఫికెట్లను జెన్యూనిటీ కోసం ఆయా సంఘాలు, సమాఖ్యలకు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ఇప్పటి వరకు క్రీడా కోటాలో 17 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాతపరీక్షకు హాజరై కనీస అర్హత మార్కులు సాధించడంతో పాటు క్రీడా ప్రాధాన్య క్రమంలోనూ అర్హత ఉండాలి. క్రీడా కోటాలో ఎంపిక కాకపోతే సాధారణ మెరిట్ ప్రకారం పరిగణనలోకి తీసుకుంటారు.

మెరిట్ జాబితా ఇలా..: ప్రతి నియామక యూనిట్, పోస్టు, యాజమాన్యం వారీగా మెరిట్ కమ్ రోస్టర్ జాబితాను రూపొందిస్తారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జేసీ వైస్‌ఛైర్మన్‌గా ఉండే జిల్లా ఎంపిక కమిటీకి డీఈవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మెరిట్ జాబితా విడుదలైన ఏడు రోజుల్లో అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పరిశీలన దశలో అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను చూపించాలి. లేదంటే అభ్యర్థిత్వం రద్దవుతుంది. నియామకాల్లో వెయిటింగ్ జాబితా ఉండదు. తుది ఎంపిక జాబితా విడుదలయ్యాక అర్హులెవరూ లేకపోవడం, ఎంపికైన వారు విధుల్లో చేరకపోవడం వంటి కారణాలతో మిగిలిపోయే ఖాళీలను తదుపరి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. ఎంపికైన వారిని రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తారు. అప్రెంటిస్ విధానం ఉండదు. నియామక ఉత్తర్వులు అందుకున్న 30 రోజుల్లో విధుల్లో చేరకపోతే ఉద్యోగం కోల్పోతారు.

ప్రిన్సిపల్‌కు అనుభవం తప్పనిసరి..: సొసైటీలు, సంక్షేమ శాఖల్లోని విద్యాసంస్థల్లో ప్రిన్సిపల్ పోస్టులకు విద్యార్హతతో పాటు ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. గుర్తింపు పొందిన సీనియర్ సెకండరీ పాఠశాలల్లో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌గా కనీసం మూడేళ్లు, సెకండరీ పాఠశాలల్లో గ్రూప్-బీ పోస్టు, పీజీటీ, లెక్చరర్, సెకండరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడిగా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అన్ని పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 2026 జులై 1 నాటికి 44 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 49 ఏళ్లు. దివ్యాంగులకు 54 ఏళ్లు. మాజీ సైనికులకు సైన్యంలో పనిచేసిన కాలానికి అదనంగా మూడేళ్ల మినహాయింపునిస్తారు.

పరీక్ష విధానమిదీ..: 80 మార్కులకు నిర్వహించే పరీక్షకు 2.30 గంటలు, వంద మార్కులకు నిర్వహించే పరీక్షకు 3 గంటల వ్యవధి ఉంటుంది. ఎస్ఏ, ఎస్జీటీలకు 80 మార్కులకు 160 ప్రశ్నలు ఇస్తారు. ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీడీ, పీఈటీ పోస్టులకు 100 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. ప్రిన్సిపల్ పోస్టులకు 100 మార్కులకు ఆంగ్ల భాషా ప్రావీణ్య పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర. ఇందులో అర్హత తప్పనిసరి. ప్రిన్సిపల్‌కు పేపర్-2 100 మార్కులకు(సీబీటీ) 200 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. పీజీటీ భాషేతర పోస్టులకు ఆంగ్ల భాషా ప్రావీణ్య పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత తప్పనిసరి. టెట్ అవసరం లేదు. పేపర్-2ను 100 మార్కులకు నిర్వహిస్తారు. టీజీటీ భాషేతర పోస్టులకు ఆంగ్ల భాషా ప్రావీణ్య పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలి. పేపర్-2 రాతపరీక్ష 80 మార్కులకు ఉంటుంది. టీజీటీ ప్రత్యేక విద్య, టీజీటీ భాషా పోస్టులకు ఆంగ్ల భాషా పరీక్ష ఉండదు. 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షలను కంప్యూటర్ ఆధారితంగా (సీబీటీ) నిర్వహిస్తారు. జేఈఈ, గేట్, క్యాట్, ఆర్ఆర్‌బీ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు పాటించే ప్రమాణాలనే అనుసరిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు సమీప రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలుంటాయి. అభ్యర్థుల సంఖ్య ఆధారంగా కేంద్రాలను కేటాయిస్తారు.

'మురసు' పెను విలయం ఏపీలో 8 మంది బలి, రూ.1918 కోట్ల నష్టం

మంది రైతులకు సంబంధించి 1,43,122 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే 12,586 మంది రైతులకు చెందిన 6,749 హెక్టార్లలో ఉద్యాన పంటలు ధ్వంసమయ్యాయి. వీటితో పాటు 983 ఇళ్లు, 346 పడవలు, 220 చేపల వలలు కూడా దెబ్బతిన్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

సహాయక చర్యలపై చంద్రబాబు సమీక్ష

గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'మురసు' తుఫాను అనంతర పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, విద్యుత్, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల్లో జరిగిన నష్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద నీరు తగ్గిన తర్వాత పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయడానికి 48 నుంచి 72 గంటల సమయం పడుతుందని అధికారులు సీఎంకు వివరించారు. వరుస తుపానులతో రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని, విద్యుత్ పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసేందుకు శుక్రవారం తాను స్వయంగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు ప్రకటించారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో దెబ్బతిన్న 1,103 ఫీడర్లకు గాను 871 ఫీడర్లను పునరుద్ధరించగా, 3,946 విద్యుత్ స్తంభాలకు గాను 1,493 స్తంభాలను సరిచేశారు. ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో 760 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులు, ప్రధాన జిల్లా రహదారులు దెబ్బతిన్నాయి. చెట్లు కూలిన 206 ప్రదేశాలలో వాటిని తొలగించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 74 గ్రామీణ రహదారులు దెబ్బతినగా, వాటి మరమ్మతులకు రూ.92.08 కోట్లు అవసరమని అంచనా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 31,428 టెలికాం టవర్లలో 30,518 టవర్లు పనిచేయడం ప్రారంభించాయని, 97.1 శాతం సేవలు పునరుద్ధరించబడ్డాయని అధికారులు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

విజయవాడలో కృష్ణా నదిపై మరో రైల్వే వంతెన..

నిర్మించనున్న నాలుగో లైన్ ప్రాజెక్టులో ఈ కొత్త వంతెన అత్యంత కీలకం కానుంది. విజయవాడ జంక్షన్-కృష్ణా కెనాల్ జంక్షన్ స్టేషన్ల మధ్య, సీతానగరం వద్ద ఈ వంతెన నిర్మాణం జరగనుంది. ఇప్పటికే ఇక్కడ కృష్ణా నదిపై రెండు రైల్వే వంతెనలు ఉన్నాయి. ఒకటి డబుల్ లైన్‌తో, మరొకటి సింగిల్ లైన్‌తో సేవలందిస్తున్నాయి. ఇప్పుడు వీటికి పక్కనే నదిపై 1.30 కిలోమీటర్ల పొడవుతో మూడో వంతెనను నిర్మించనున్నారు. ఈ కొత్త వంతెన నిర్మాణం పూర్తయితే రైళ్ల రాకపోకల్లో జాప్యం గణనీయంగా తగ్గనుంది. ముఖ్యంగా తెనాలి, గుంటూరు మార్గాల నుంచి విజయవాడ వచ్చే రైళ్లు కృష్ణా కెనాల్ స్టేషన్ వద్ద సిగ్నల్ కోసం నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. అదేవిధంగా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి విజయవాడ మీదుగా తమిళనాడు వైపు వెళ్లే గూడ్స్ రైళ్లు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ రైల్వే బోర్డు ఆమోదం కోసం వేచి చూస్తోంది.

చరిత్రను తిరగరాసే దిశగా డెమోక్రాట్ల అడుగులు

కట్టబెడుతున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలైన దాదాపు అన్ని స్థానాల్లోనూ ఇప్పుడు డెమోక్రాట్లు విజయకేతనం ఎగురవేశారు. 2024 ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందిన 234 జిల్లాల్లో 52 జిల్లాలను డెమోక్రాట్లు కైవసం చేసుకున్నారు. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం.. డెమోక్రాట్లు 253 స్థానాలను కైవసం చేసుకోగా.. రిపబ్లికన్లు 155 స్థానాలకు పరిమితమయ్యారు. మరో 27 చోట్ల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. ఈ క్రమంలో డెమోక్రాట్లు 260 ఫిగర్‌ను దాటే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అంతకుమించి సాధించినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఒకవేళ అదే జరిగితే ప్రతినిధుల సభలో డెమోక్రాట్లకు 85 పైచిలుకు స్థానాల మెజారిటీ లభిస్తుంది. సభలో 60 శాతం మంది వాళ్లే ఉంటారు. 1990 ప్రారంభంలో ఆ పార్టీ అత్యధికంగా 267 స్థానాలను దక్కించుకుంది. ఇప్పటివరకు ఆ పార్టీకి అదే పెద్ద మెజారిటీ. 2008లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు ఆ పార్టీ 257 స్థానాలను కైవసం చేసుకుంది. తాజా ఫలితాలతో డెమోక్రాట్లు 1990 చరిత్రను తిరగరాస్తారా.. 2008 మెజారిటీని అధిగమిస్తారా? అన్న దానిపై ఆసక్తి నెలకొంది.

ఢిల్లీలో వాయు కాలుష్యం.. అమల్లోకి మూడో దశ ఆంక్షలు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వాయు కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది. దీపావళి పండుగ వేళ వాయు నాణ్యత (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్)-3ని అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ఢిల్లీలో గురువారం వాయునాణ్యత 382 మార్కును తాకింది. ఏక్యూఐ 301-400 మధ్య ఉంటే బాగా తక్కువగా ఉన్నట్లు లెక్క. అంతకుమించి నాణ్యత పడిపోయే అవకాశం ఉన్నప్పుడు గ్రాప్-3 ఆంక్షల్ని అమలు చేస్తారు. దీపావళి సందర్భంగా కాలుష్యం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రాప్-3 ఆంక్షలు అమల్లోకి వస్తే.. అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధంతో పాటు, బీఎస్-3 లేదా అంతకంటే పాత ప్రమాణాల పెట్రోల్ కార్లు, బీఎస్-4 లేదా అంతకంటే పాత ప్రమాణాల డీజిల్ కార్ల రాకపోకలపై పరిమితులు విధిస్తారు. అంతేకాకుండా కంకర రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని తరలించకుండా నిషేధం విధిస్తారు. స్టోన్ క్రషర్స్, గనుల తవ్వకాలను నిలిపివేస్తారు.

కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్..

అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు. మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

నవంబర్ 7 (శనివారం): ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8 (ఆదివారం): హకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనాలను ప్రారంభిస్తారు. బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు. నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు. కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు. రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

నవంబర్ 9 (సోమవారం): ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు. పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

విశాఖలో మొబైల్ షాపులో భారీ చోరీ కేసు ఛేదన.. ముగ్గురు పట్టుబాటు

25 ఐఫోన్లతో సహా 35 విలువైన వస్తువులు స్వాధీనం..

ఇద్దరు అరెస్ట్, బాలుడు జువైనల్ హోమ్‌కు తరలింపు



విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)

విశాఖపట్నం దబాగార్డెన్స్‌లోని బీసీపీ మాల్‌లో ఉన్న సెల్ పాయింట్ మొబైల్ షాపులో జరిగిన భారీ చోరీ కేసును టూ టౌన్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి ఇద్దరు యువకులతో పాటు ఒక బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 25 ఐఫోన్లతో సహా మొత్తం 35 విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గత అక్టోబర్ 27వ తేదీ రాత్రి నుంచి 28వ తేదీ తెల్లవారుజాము మధ్య దుండగులు మొబైల్ షాపు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం షాపులోని మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను అపహరించి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 25 ఐఫోన్లు, ఒక నథింగ్, రెండు రియల్‌మీ, రెండు శాంసంగ్, ఐదు వివో మొబైల్ ఫోన్లతో పాటు యాపిల్ వాచీలు, ఒప్పో బడ్స్ సహా మొత్తం 35 వస్తువులను రికవరీ చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించగా, బాలుడిని జువైనల్ హోమ్‌కు పంపించారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో పోలీసులు కీలక పురోగతి సాధించారు.

అనధికారికంగా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

లైసెన్సులు లేకుండా మందుగుండు సామగ్రి నిల్వ చేసినా,

విక్రయించినా కేసులు తప్పవు: వన్‌టౌన్ సీఐ వరప్రసాద్

విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)



దీపావళి పండుగ నేపథ్యంలో అనుమతులు, లైసెన్సులు లేకుండా బాణసంచా నిల్వ చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు సామగ్రి విక్రయించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల నుంచి సరైన లైసెన్సులు పొందిన వ్యాపారులు మాత్రమే బాణసంచా విక్రయాలు నిర్వహించాలని సూచించారు. అనధికారికంగా క్రాకర్స్ విక్రయించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి వేడుకల సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తగిన జాగ్రత్తలతో ప్రశాంతమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్నట్లు తెలిసినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సీఐ వరప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు అందాలి..

గాజువాకలో అవగాహన ర్యాలీ



గాజువాక, నవంబర్ 09 (సిటిజన్ టైమ్స్):

ఆర్థిక ఇబ్బందులు న్యాయానికి అడ్డంకి కాకూడదని, ప్రతి పౌరుడికి సమాన న్యాయం పొందే హక్కు ఉందనే సందేశంతో గాజువాకలో జాతీయ న్యాయ సేవా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందనే విషయాన్ని ప్రజలకు తెలియజేస్తూ న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గాజువాక కోర్టు సముదాయంలో 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి ఎస్.ఎం. ఫణికుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం కోర్టు ప్రాంగణం నుంచి 100 ఫీట్ రోడ్ సిగ్నల్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. అక్కడ న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది కలిసి మానవహారం ఏర్పాటు చేసి న్యాయ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్హులైన పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించే విధానాలను వివరించారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు అందుబాటులో ఉండాలని, న్యాయం పొందే హక్కుపై ప్రజల్లో అవగాహన పెరగాలని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 8వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎస్. కవిత, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) డి. గీతారాణి, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), 9వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సంగవరపు సూర్యకిరణ్ శ్రీ, విశాఖపట్నం సిటీ సౌత్ ఏసీపీ వై. శ్రీనివాసరావు, గాజువాక సీఐ వాసు నాయుడు, దువ్వాడ సీఐ నమ్మి గణేష్, గాజువాక ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ షేక్ హుస్సేన్, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖకు ప్రపంచ పారిశ్రామిక ప్రతినిధుల రాక..

సీఐఐ సదస్సుకు సర్వం సిద్ధం!

విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

అంతర్జాతీయ పెట్టుబడులకు వేదికగా విశాఖపట్నం మరోసారి ప్రపంచ పారిశ్రామిక రంగం దృష్టిని ఆకర్షించనుంది. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చేందుకు నగరం ముస్తాబవుతోంది. ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి. అతిథుల స్వాగతం నుంచి వసతి, రవాణా, భద్రత, పర్యాటక ప్రాంతాల సందర్శన వరకు ప్రతి అంశాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. సదస్సు ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్‌తో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పనిచేస్తేనే అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలమని స్పష్టం చేశారు. దేశ, విదేశీ ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అతిథులకు విశాఖ నగర ప్రత్యేకతలను పరిచయం చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించారు. పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక సర్క్యూట్లు రూపొందించడం, గైడ్లను సిద్ధం చేయడం, హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సులను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు చేపట్టనున్నారు. పర్యాటక మార్గాల్లో స్వాగత బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు నగరమంతా సదస్సు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నగర సుందరీకరణ, పారిశుధ్య నిర్వహణకు జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. ప్రధాన రహదారులు, సదస్సు పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను



వేగవంతం చేయాలని, అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సదస్సు వేదికల నిర్మాణ భద్రత, అగ్నిమాపక రక్షణ, విద్యుత్ భద్రత, సమాచార ప్రసార వ్యవస్థలను పరిశీలించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విమానాశ్రయంలో ప్రత్యేక స్వాగత బృందాలు, రిసెప్షన్ డెస్కులు ఏర్పాటు చేసి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అతిథులకు ఆహ్వానం పలకనున్నారు. వసతి, రవాణా, ప్రోటోకాల్, విందు కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్, పాసుల జారీ కోసం ప్రధాన వేదిక ఎదురుగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మొబైల్ మరుగుదొడ్ల సదుపాయాలు కూడా కల్పించనున్నారు. జిల్లా



కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ నవంబర్ 9 నుంచి కంట్రోల్ రూమ్ సేవలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. రిజిస్ట్రేషన్, పాసుల జారీ ప్రక్రియను కలెక్టరేట్ నుంచి పర్యవేక్షిస్తామని, సంబంధిత శాఖల అధికారులు కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సమీక్షలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఏపీఈడీబీ సీఈఓ సాన్మోహన్, ఏపీఐఐసీ చైర్మన్, ఎండీ దినేష్ కుమార్, సెర్ప్ సీఈఓ కరుణ, జీసీసీ ఎండీ శోభిక, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఐఏఎస్ అధికారులు గీతాంజలి శర్మ, గెడ్డం శేఖర్ బాబు, డీసీపీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

ఉదయం 7 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల ప్రారంభం.. 8 గంటలకు ఓట్ల లెక్కింపు

రీ-కౌంటింగ్‌కు అవకాశం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి



విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

విశాఖపట్నం జిల్లాలో పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కౌంటింగ్ ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఉదయం 7 గంటలకే అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరవాలని, ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని, అనధికార వ్యక్తులను అనుమతించరాదని సూచించారు. ఎవరైనా గొడవలు, అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే తొలుత సముదాయించాలని, అప్పటికీ వినకపోతే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఇన్‌చార్జిని నియమించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు ఓట్ల లెక్కింపు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, చెల్లుబాటు అయ్యే, చెల్లని ఓట్ల విషయంలో అభ్యర్థులు, ఏజెంట్లకు స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రాథమిక లెక్కింపు పూర్తయిన వెంటనే తదుపరి వివరణాత్మక లెక్కింపు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల వారీగా లెక్కింపు పూర్తయిన వెంటనే సంబంధిత అధికారి సంతకంతో ఫలితాలను వెల్లడించాలని ఆదేశించారు. రీ-కౌంటింగ్‌కు దారితీసే పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ఫలితాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి సమస్యలుఅ తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఆయా మండలాల రిటర్నింగ్ అధికారులు, లైన్ ఇన్‌చార్జి అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ ముప్పులను ఎదుర్కొనేందుకు ఉమ్మడి శిక్షణ

భారత నౌకాదళంతో కలిసి శిక్షణలో పాల్గొన్న కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఐజీపీ గోపీనాథ్ జట్టి



విశాఖపట్నం, నవంబర్ 6 (సిటిజన్ టైమ్స్):

సముద్ర తీర ప్రాంత భద్రతను మరింత పటిష్టం చేయడంతోపాటు డ్రోన్ల ద్వారా ఎదురయ్యే భద్రతాపరమైన ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, భారత నౌకాదళంతో కలిసి ఉమ్మడి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఐజీపీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్ పాల్గొన్నారు. డ్రోన్ వ్యతిరేక చర్యలపై నిర్వహించిన ఈ శిక్షణలో వివిధ భద్రతా సంస్థల మధ్య సమన్వయం, కార్యాచరణ సన్నద్ధత, డ్రోన్లకు సంబంధించిన భద్రతా సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించారు. ఇటువంటి ఉమ్మడి శిక్షణ కార్యక్రమాలు తీర ప్రాంత భద్రతను మరింత బలోపేతం చేయడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించేందుకు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కె. శ్రావణి, అదనపు ఎస్పీ కె.వి. రమణ, నార్త్ డీఎస్పీ ఎస్. కిరణ్ కుమార్, రుషికొండ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, పోర్ట్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్‌తో పాటు ఎస్సైలు పాల్గొన్నారు.

విశాఖ సమగ్ర అభివృద్ధికి కార్పొరేటర్లు సమష్టిగా కృషి చేయాలి: ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

విశాఖ నగర అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ఎన్డీఏ కార్పొరేటర్లంతా సమష్టిగా కృషి చేయాలని విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పిలుపునిచ్చారు. ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో నగరంలోని హోటల్ దసపల్లాలో విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన నూతన ఎన్డీఏ కార్పొరేటర్లతో ఎంపీ శ్రీభరత్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా నగరంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వార్డుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య ఉన్న ఐక్యతే కూటమి విజయానికి ప్రధాన బలమని శ్రీభరత్ స్పష్టం చేశారు. ఇదే ఐక్యతను కొనసాగిస్తూ విశాఖ నగర సమగ్ర అభివృద్ధి కోసం నాయకులు, కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, జీవీఎంసీ నూతన మేయర్ ముక్కా శ్రావణితో పాటు కూటమి ముఖ్య నాయకులు, నూతన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల ఫలితాలు నేడే.. కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

78 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు.. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం

53 ఎంపీటీసీ, 4 జెడ్పీటీసీ స్థానాల ఫలితాలపై ఉత్కంఠ

విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

విశాఖపట్నం జిల్లాలో పరిషత్ ఎన్నికల ఫలితాల వెల్లడికి రంగం సిద్ధమైంది. పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో నిర్వహించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును నేడు చేపట్టనున్నారు. ఇందుకోసం జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 78 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయగా, ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలోని నాలుగు మండలాలకు సంబంధించి 53 ఎంపీటీసీ, 4 జెడ్పీటీసీ సెగ్మెంట్ల ఫలితాలను అధికారులు వెల్లడించనున్నారు. పెందుర్తి మండలంలోని పెదగాడి ఎంపీటీసీ సెగ్మెంట్ ఏకగ్రీవం కావడంతో మిగిలిన సెగ్మెంట్లకు సంబంధించిన ఓట్లను మాత్రమే లెక్కించనున్నారు.

మూడు కేంద్రాల్లో కౌంటింగ్ ఏర్పాట్లు

ఆనందపురం మండలానికి సంబంధించి స్థానిక ఎంపీడీవో కార్యాలయ నూతన సమావేశ మందిరంలో 20 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. పెందుర్తి మండల ఓట్ల లెక్కింపు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల డైనింగ్ హాలులో 18 టేబుళ్లపై నిర్వహించనున్నారు. భీమిలిలోని సెడార్ పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్ హాల్‌లో భీమిలి మండలానికి సంబంధించి 20 టేబుళ్లు, అదే పాఠశాల మొదటి అంతస్తులో పద్మనాభం మండలానికి సంబంధించి మరో 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 78 టేబుళ్ల ద్వారా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో



నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా కౌంటింగ్ కేంద్రాల వారీగా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు విధానం, ఎన్నికల నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నాలుగు మండలాల పరిధిలోని 53 ఎంపీటీసీ, 4 జెడ్పీటీసీ సెగ్మెంట్ల ఫలితాల కోసం అభ్యర్థులు, రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

అంతర్జాతీయ సదస్సుకు విశాఖ ముస్తాబు..

ఏర్పాట్లపై స్పెషల్ సీఎస్ క్షేత్రస్థాయి పరిశీలన





విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

అంతర్జాతీయ పారిశ్రామిక ప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చేందుకు విశాఖపట్నం నగరం సరికొత్త రూపు సంతరించుకుంటోంది. ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సదస్సుకు వచ్చే ప్రతినిధులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలిసి సదస్సు ప్రాంగణాన్ని సందర్శించిన ఆయన, అక్కడ చేపడుతున్న నిర్మాణ, అభివృద్ధి, సుందరీకరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రాంగణ లేఅవుట్, ప్రధాన ప్రవేశ ద్వారం, రిజిస్ట్రేషన్ బ్లాక్, ల్యాండ్‌స్కేపింగ్, ఫౌంటెన్లు, ఆకర్షణీయమైన శిల్పాలు, పార్కింగ్ ప్రాంతాలు, బారికేడింగ్, వాహనాల రాకపోకల మార్గాలను పరిశీలించారు. సూచిక బోర్డులు, హోర్డింగులు, విద్యుత్ దీపాల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. సదస్సుకు హాజరయ్యే దేశ, విదేశీ ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని రావత్ సూచించారు. సదస్సు పరిసర ప్రాంతాలను పచ్చదనం, ల్యాండ్‌స్కేపింగ్, పెయింటింగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. చేపట్టిన ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సదస్సు నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రాంగణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సుందరీకరణ పనుల వివరాలను స్పెషల్ సీఎస్‌కు వివరించారు. ఈ పరిశీలనలో ఏపీఈడీబీ సీఈఓ సాన్మోహన్, ఏపీఐఐసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కుమార్, సీఐఐ నిర్వాహకులు మహేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీఐ పేరుతో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన 1,300 మంది బ్లాక్‌లిస్ట్‌లోకి



శ్రీకాకుళం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) వ్యక్తిగత కక్షలు, స్వార్థ ప్రయోజనాలు, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు దుర్వినియోగం చేస్తే సహించేది లేదని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు హెచ్చరించారు. ఆర్టీఐ చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు అవినీతిని అరికట్టేందుకు ఉద్దేశించిందని, దానిని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ.. ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ పాలనలో అవకతవకలు, అవినీతిని ప్రశ్నించేందుకు ఆర్టీఐని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం పేరుకుపోయిన పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని, ఇప్పటివరకు దాదాపు 10 వేల దరఖాస్తులను క్లియర్ చేసి సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని దాచిపెట్టే అధికారులపై ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 20(1) ప్రకారం గరిష్టంగా రూ.25 వేల జరిమానా విధించడంతో పాటు, సెక్షన్ 20(2) కింద శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మరోవైపు, చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ అధికారులను వేధించే ధోరణితో పదేపదే నిరాధార దరఖాస్తులు సమర్పిస్తున్న సుమారు 1,200 నుంచి 1,300 మందిని 'మిస్‌యూజర్ ఆఫ్ ఆర్టీఐ' కింద గుర్తించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు చెప్పారు. వారి దరఖాస్తులను తిరస్కరించాలని అన్ని శాఖల కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడును సత్కరించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత.. పోలీసులకు ఏసీపీ దిశానిర్దేశం



పెందుర్తి, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వహించాలని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ పి. ప్రదీప్తి పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ నేపథ్యంలో పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఏసీపీ పి. ప్రదీప్తి సందర్శించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్‌తో కలిసి పోలీసు సిబ్బందితో సమావేశమై భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా బ్రీఫింగ్ నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు విధులు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల పర్యవేక్షణ, గుంపుల నియంత్రణ తదితర అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే అనుమతించాలని, అభ్యర్థులు, వారి మద్దతుదారుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవాల పేరుతో ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, గుంపులుగా చేరడం వంటి చర్యలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది విధుల నిర్వహణలో సంయమనం, క్రమశిక్షణ, సమన్వయం పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ పి. ప్రదీప్తి, ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా విశాఖపట్నం సిటీ పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలి


విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలు, ఆత్మహత్యల నివారణపై అవగాహన

విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

బాల్య వివాహాలు బాలల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటి నిర్మూలనకు ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ కమ్ ప్రొబేషన్ అధికారి ఐ. అనిజ కుమారి పిలుపునిచ్చారు. బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో బాలలపై జరిగే అన్యాయాలను అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు. విశాఖపట్నం జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో గాజువాకలోని ఎస్.ఆర్. కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులు, బాలల సంరక్షణ చట్టాలు, ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిజ కుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, తమ లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోక్సో చట్టం, బాలల హక్కులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి విషయాలను నేర్చుకుంటూ క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఐ. సులేఖ మిషన్ వాత్సల్య పథకం, దాని లక్ష్యాలు, బాలల సంరక్షణకు అందించే సేవలను వివరించారు. ఔట్‌రీచ్ వర్కర్ సాయి కుమారి చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ, దానికి సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ దివ్య మాట్లాడుతూ బాలలు ఏవైనా సమస్యలు లేదా ఆపదలను ఎదుర్కొన్నప్పుడు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. వన్ స్టాప్ సఖి సెంటర్ ప్రతినిధి రాణి బాలలపై జరిగే నేరాలు, వేధింపుల గురించి వివరించి, బాధితులు భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టం, బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం, పోషకాహారం, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



విశాఖ అభివృద్ధికి కృషి చేస్తాం.. ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం



గాజువాక, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

విశాఖపట్నం నగర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, నగర మేయర్ ముక్కా శ్రావణి పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును విశాఖపట్నం నగర మేయర్ ముక్కా శ్రావణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి, ప్రజలకు అందించాల్సిన సేవలు, పార్టీ పరంగా నిర్వహించాల్సిన బాధ్యతలపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ ముక్కా శ్రావణి మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు, టీడీపీ కార్యకర్తలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. మహిళా శక్తి, మహిళా సాధికారతకు టీడీపీ పెద్దపీట వేస్తోందని, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కార్పొరేషన్‌లో సుమారు 60 మంది మహిళలకు అవకాశం కల్పించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు తమపై మరింత బాధ్యతను ఉంచారని, ఆ నమ్మకానికి అనుగుణంగా అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు. విశాఖపట్నాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచమంతా నగరం వైపు చూసేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

బాణసంచా విక్రయాలు, నిల్వలకు అనుమతులు తప్పనిసరి



విజయనగరం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాల విషయంలో సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ సూచించారు. బాణసంచా ప్రమాదాలను నివారించేందుకు వ్యాపారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నవంబర్ 6న జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ, బాణసంచా గోడౌన్లు, లైసెన్సు షాపులు, తాత్కాలిక విక్రయ కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు అమలయ్యేలా తనిఖీలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక విక్రయ షాపులను నివాస ప్రాంతాలు, ఆసుపత్రులకు దూరంగా పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. షాపుల మధ్య కనీసం 15 మీటర్ల దూరం ఉండాలని స్పష్టం చేశారు. అనుమతులు కలిగిన షాపుల నుంచే బాణసంచా కొనుగోలు చేయాలని, తాత్కాలిక విక్రయదారులు సంబంధిత అధికారుల నుంచి లైసెన్సులు పొందాలని సూచించారు. ప్రతి షాపు వద్ద నీటి టబ్బులు, పొడి ఇసుక బస్తాలు, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కొనుగోలుదారులు ఒకేసారి గుంపులుగా చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వస్తువులను షాపుల సమీపంలో ఉంచరాదన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులు, ఫ్లెక్సీలను షాపుల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. బాణసంచాను ప్రయాణికులు ఉపయోగించే వాహనాల్లో రవాణా చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక షాపులను అగ్ని నిరోధక లక్షణాలు కలిగిన ఆస్బెస్టాస్, జి.ఎస్. రేకులతో నిర్మించుకోవాలని తెలిపారు. బాణసంచా నిల్వలు, విక్రయ కేంద్రాల్లో తగిన వెలుతురు ఉండాలని, లోపలకు వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు వేర్వేరు ద్వారాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గోడౌన్లలో సురక్షితమైన విద్యుత్ వైరింగ్, ఫైర్ అలారాలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. లైసెన్సులో పేర్కొన్న సమయం వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించాలని తెలిపారు. తాత్కాలిక లైసెన్సుల గడువు ముగిసిన అనంతరం మిగిలిన బాణసంచాను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన సురక్షిత గోడౌన్లలోనే భద్రపరచాలని, ఇళ్లలో లేదా జనావాసాల మధ్య నిల్వ చేయరాదని హెచ్చరించారు. భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై, జనావాసాల్లో బాణసంచా నిల్వ ఉంచిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

అమలాపురం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం అమలాపురంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని డీఎస్పీ ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ పి. వీరబాబు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నౌషాద్ అహమ్మద్ కుటుంబానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే నల్లారి



గుర్రంకొండ, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

టీడీపీ సీనియర్ నాయకుడు, గుర్రంకొండ మాజీ సర్పంచ్ నౌషాద్ అహమ్మద్ మృతి పార్టీకి తీరని లోటని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఒక మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. నౌషాద్ అహమ్మద్ మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గుర్రంకొండలోని ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో పార్టీ తరఫున నౌషాద్ అహమ్మద్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాయని జగదీష్ కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు మూర్తిస్వామి, ఎల్లుట్ల మురళి, సంగసముద్రం శేఖర్, ఎల్లంపల్లి రెడ్డెప్పరెడ్డి, మండలంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి స్టూడెంట్ అసెంబ్లీలో హిమశ్రీకి ప్రథమ స్థానం



పులివెందుల, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, రాజ్యాంగంపై అవగాహన, సభా నిర్వహణ పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్టూడెంట్ అసెంబ్లీలో పులివెందుల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్. హిమశ్రీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలో హిమశ్రీ 120 మార్కులు సాధించి విజేతగా నిలిచింది. హిమశ్రీ గత ఏడాది జాతీయ ఉపకార వేతనాల పరీక్షలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం విశేషం. స్టూడెంట్ అసెంబ్లీలో రెండో స్థానాన్ని అహోబిలాపురం విద్యార్థి ఆర్. అఖిల్, మూడో స్థానాన్ని అంకాలమ్మగూడూరు విద్యార్థిని ఏ. యస్మిత సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం వారిలో ఒకరికి అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీలో పులివెందుల నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరించే అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు రవిచంద్రారెడ్డి, సెల్వరాజ్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభ పట్ల ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందించారు.

ఆరు దశాబ్దాలుగా అఖండ సంప్రదాయం..

మర్రిపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు వేళాయె!

66 ఏళ్లుగా తరతరాల భక్తి వారసత్వం.. అన్ని వర్గాల సమైక్యతకు ప్రతీకగా గైరమ్మ పండుగ

భక్తి పారవశ్యంలో ఆధ్యాత్మిక వేడుకలు.. జానపద కళలతో అలరించనున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఈ నెల 8 నుంచి 13 వరకు ఉత్సవాలు.. చివరి రోజు వైభవంగా నిమజ్జన మహోత్సవం



విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 66 ఏళ్లుగా తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం! కాలం మారినా.. తరాలు మారినా.. ఆచారం మాత్రం మారలేదు. భక్తి, విశ్వాసం, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న మర్రిపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు మరోసారి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ప్రతి ఏడాది స్థానిక ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఒక్కటై జరుపుకునే ఈ వేడుకలు మర్రిపాలెం ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తున్నాయి. విశాఖపట్నం 63వ వార్డు పరిధిలోని మర్రిపాలెం మహారాణి వీధిలో నవంబర్ 8వ తేదీ ఆదివారం దీపావళి సందర్భంగా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్థానికంగా గైరమ్మ పండుగగా ప్రసిద్ధి చెందిన ఈ వేడుకలు నవంబర్ 13వ తేదీ నాగుల చవితి వరకు ఆరు రోజులపాటు కొనసాగనున్నాయి. జై భీమ్ మరియు జై రామ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

66 ఏళ్లుగా చెక్కుచెదరని సంప్రదాయం

1960లో ప్రారంభమైన ఈ ఉత్సవాలు నేటికీ అదే భక్తిశ్రద్ధలతో కొనసాగుతుండటం విశేషం. మర్రిపాలెం మహారాణి వీధితోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వివిధ సామాజిక వర్గాల ప్రజలు కలిసికట్టుగా ఈ పండుగను నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. కేవలం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంగానే కాకుండా తరతరాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే సామాజిక ఐక్యతా వేడుకగా ఈ ఉత్సవాలు నిలుస్తున్నాయి. పెద్దలు అందించిన సంప్రదాయాన్ని నేటి యువత కూడా ముందుకు తీసుకెళ్తుండటం విశేషం.

భక్తి కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సందడి

ఉత్సవాల ఆరు రోజులపాటు గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు నిర్వహించనున్నారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని కానుకలు సమర్పించనున్నారు. విద్యుత్ దీపాల అలంకరణలతో మహారాణి వీధి పండుగ శోభను సంతరించుకోనుంది. భక్తి కార్యక్రమాలతో పాటు ప్రజలను ఆకట్టుకునేలా పలు జానపద, సాంస్కృతిక ప్రదర్శనలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జానపద కళలకు పెద్దపీట

ఈ ఉత్సవాల్లో సంప్రదాయ కళారూపాలకు ప్రత్యేక స్థానం కల్పించనున్నారు. బుర్రకథ, డాన్స్ బేబీ డాన్స్, డూప్ రికార్డింగ్ డాన్స్ వంటి ప్రదర్శనలతో పాటు రేలారే రేలా జానపద గీతాల కార్యక్రమం ప్రేక్షకులను అలరించనుంది. భక్తి, వినోదం, జానపద కళల సమ్మేళనంగా ఈ వేడుకలు సాగనున్నాయి.

13న వైభవంగా నిమజ్జన మహోత్సవం

ఆరు రోజుల ఉత్సవాలకు ముగింపుగా నవంబర్ 13వ తేదీ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు నిమజ్జన ఊరేగింపు ప్రారంభం కానుంది. ఈ ఊరేగింపులో బల్ల వేషాలు, డప్పుల వాయిద్యాలు, సాము గరిడి, సేవా గరిడి, పులి వేషాలు, కోలాటాలు, అమ్మవారి వేషధారణలు, కోయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సంప్రదాయ కళారూపాలు, జానపద నృత్యాలతో సాగనున్న ఈ ఊరేగింపు పండుగకు ప్రధాన ఆకర్షణ కానుంది.

ఐక్యతకు చిరునామాగా గైరమ్మ పండుగ

ఆరు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలు మర్రిపాలెం ప్రజల మధ్య ఉన్న అనుబంధానికి, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పాతతరం నుంచి కొత్తతరానికి అందుతున్న ఈ సంప్రదాయం మరింత వైభవంగా కొనసాగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ఈ నెల 8 నుంచి ప్రారంభమయ్యే గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని జై భీమ్ మరియు జై రామ్ సంఘం నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు.

తుఫాను ప్రభావిత గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వండి

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రజలు సహకరించాలి.. విద్యుత్ శాఖ అధికారుల విజ్ఞప్తి



అమలాపురం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని ఏ గ్రామంలోనైనా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోతే ప్రజలు వెంటనే జిల్లా కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు, అంతరాయాలను తెలియజేసేందుకు జిల్లా కంట్రోల్ రూం ఫోన్ నంబర్లు 9440904477, 9440814207 అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే ఏపీఈపీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి కూడా విద్యుత్ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. తుఫాను వంటి విపత్తు సమయంలో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రజలు అందించిన సహకారానికి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రజలు సహకరించాలని, విద్యుత్ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

విద్యుత్ సమస్యల సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు:
జిల్లా కంట్రోల్ రూం: 9440904477
జిల్లా కంట్రోల్ రూం: 9440814207
ఏపీఈపీడీసీఎల్ టోల్ ఫ్రీ: 1912.

అమలాపురం డివిజన్‌లో ఓట్ల లెక్కింపునకు భారీ ఏర్పాట్లు

10 మండలాలకు 196 కౌంటింగ్ టేబుళ్లు..

21 కౌంటింగ్ హాళ్లు సిద్ధం



అమలాపురం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)

అమలాపురం డివిజన్ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమలాపురం పట్టణంలోని ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో డివిజన్ పరిధిలోని 10 మండలాలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశారు. అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, రాజోలు మండలాల్లోని ఎంపీటీసీ స్థానాలకు ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు మొత్తం 196 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేస్తున్నారు. కౌంటింగ్ కోసం కళాశాలలోని జూలజీ, కామర్స్, డి.ఈడీ, బి.ఈడీ, ఎన్.సి.సి. బ్లాక్‌లలో ఏర్పాట్లు చేపట్టారు. మండలాల వారీగా మొత్తం 21 కౌంటింగ్ హాళ్లను కేటాయించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన టేబుళ్లు, సిబ్బంది, విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సమకూర్చాలని కలెక్టర్ సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అనుమతి పొందిన అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశం కల్పించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, విజయోత్సవాలు, ఊరేగింపులు, బహిరంగ సమావేశాల విషయంలో నిబంధనల ఉల్లంఘన జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. పోలీసు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేని వర్సిటీ యాజమాన్యానికి పదవుల్లో కొనసాగే అర్హత లేదు

ప్రశ్నించే విద్యార్థి నాయకులకు క్రమశిక్షణ నోటీసులా? తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



విశాఖపట్నం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్న యాజమాన్యం, సమస్యలపై ప్రశ్నించే విద్యార్థి నాయకులకు క్రమశిక్షణ నోటీసులు జారీ చేయడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు నోటీసులతో భయపెట్టాలని చూడటం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు సాయితేజ, జిల్లా కార్యదర్శి జి. అజయ్ విమర్శించారు. శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ కార్యాలయం ఎదుట నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, యూనివర్సిటీలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యార్థుల నుంచి వివిధ రకాల ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యం కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం విఫలమవుతోందన్నారు. ముఖ్యంగా ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీజుల పేరుతో విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని, విద్యుత్ ఛార్జీలను కమర్షియల్ కేటగిరీ నుంచి డొమెస్టిక్ కేటగిరీకి మార్చాలన్న డిమాండ్‌ను సైతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, శుభ్రమైన తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ వంటి కనీస సదుపాయాలు కూడా సక్రమంగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అనేక విభాగాల్లో అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో యాజమాన్యం చెలగాటమాడుతోందని జి. అజయ్ ఆరోపించారు. పరిశోధక విద్యార్థులకు అవసరమైన పరిశోధనా పరికరాలు, ప్రయోగశాలలు, ఇంటర్నెట్ తదితర మౌలిక వసతులు కల్పించడంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినా పరిష్కారం చూపడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించినందుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి. అజయ్, యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు తరుణ్‌లకు క్రమశిక్షణ ఉల్లంఘన పేరుతో నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించడం క్రమశిక్షణ ఉల్లంఘన అయితే, సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం ఏ క్రమశిక్షణ కిందకు వస్తుందని యూనివర్సిటీ అధికారులు సమాధానం చెప్పాలని నిలదీశారు. విద్యార్థులు అధికారులను కలవకూడదా, వినతిపత్రాలు అందించకూడదా, సమస్యలపై ఆందోళనలు నిర్వహించకూడదా అని ప్రశ్నించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల సొంత ఆస్తి కాదని, ప్రజల సొమ్ముతో నడుస్తున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యాసంస్థ అని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. విద్యార్థుల గొంతు నొక్కడం కాకుండా వారికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించడమే యూనివర్సిటీ బాధ్యత అని స్పష్టం చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీజుల భారాన్ని తగ్గించాలని, విద్యుత్ ఛార్జీలను డొమెస్టిక్ కేటగిరీకి మార్చాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, శుభ్రమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశోధక విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు వీసీ, యూనివర్సిటీ అధికారులు విద్యార్థి సంఘాలతో తక్షణమే చర్చలు జరిపి, సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా జి. అజయ్, తరుణ్‌లకు జారీ చేసిన క్రమశిక్షణ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు, నోటీసులు వెనక్కి తీసుకునే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఆంధ్ర విశ్వవిద్యాలయం కార్యదర్శి అంజలి, ఉపాధ్యక్షులు ప్రగతి, సంజయ్, విశాల్, దోహిత్, నిఖిల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

మధురవాడలో 45 దరఖాస్తులు.. ఇప్పటివరకు ఒక్క లైసెన్సూ జారీ కాలేదు: పీఎం పాలెం సీఐ బాలకృష్ణ



మధురవాడ, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

దీపావళి పండుగ వేళ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ గేదెల బాలకృష్ణ హెచ్చరించారు. ముందస్తు అనుమతులు లేకుండా బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. విశాఖ సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ ఎస్. అప్పలరాజు పర్యవేక్షణలో మధురవాడ పరిధిలో బాణసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు పోలీస్, అగ్నిమాపక, జీవీఎంసీ శాఖల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. లైసెన్సులు పొందిన ప్రతి స్టాల్ వద్ద నీరు, ఇసుక బకెట్లు, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నిర్ణీత పరిమితికి మించి మందుగుండు సామగ్రిని నిల్వ చేయడం నిషేధమని తెలిపారు. మధురవాడ పరిధిలో బాణసంచా స్టాళ్ల ఏర్పాటుకు ఇప్పటివరకు 45 దరఖాస్తులు అందాయని, అయితే ఏ ఒక్క దరఖాస్తుదారుడికీ ఇంకా లైసెన్సు జారీ చేయలేదని సీఐ వెల్లడించారు. ప్రాంతాల వారీగా ఓజోన్ వ్యాలీ నుంచి 31, మిధునాపురి కాలనీ రోడ్డు నుంచి 4, లా కాలేజ్ రోడ్డు నుంచి 2, నగరంపాలెం రోడ్డు నుంచి 4, బక్కన్నపాలెం నుంచి 3 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జనావాసాలు, నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే బాణసంచా విక్రయాలకు అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. మరోవైపు మధురవాడలో రద్దీగా ఉండే రహదారులు, ఇళ్ల మధ్య బాణసంచా స్టాళ్లకు అనుమతులు ఇవ్వవద్దని స్థానికులు కోరుతున్నారు. జనసంచారం తక్కువగా ఉండే ఓజోన్ వ్యాలీ ప్రాంతంలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం సురక్షితమని వారు అభిప్రాయపడుతున్నారు. దీపావళి సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దీపావళి వేళ మున్సిపల్ కార్మికులకు చైర్మన్ దంపతుల కానుక



గుమ్మిడిదల, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)

నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై పట్టణ పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికులతో దీపావళి ఆనందాన్ని పంచుకునేందుకు గుమ్మిడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముందుకొచ్చారు. పండుగను పురస్కరించుకుని తన సొంత నిధులతో మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు నూతన దుస్తులను అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. తన సతీమణి స్వాతితో కలిసి కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. నిత్యం పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు వివిధ సేవలు అందిస్తున్న కార్మికుల కృషిని గుర్తిస్తూ దీపావళి కానుకగా ఈ దుస్తులను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ దంపతులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్మికులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. గుమ్మిడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దశరథ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు పద్మ, రాజశేఖర్, మురళి, నిర్మల, రాధిక, కిషన్, సంజీవరెడ్డి, సోనీ, గౌసియా, మాధవి, రమేష్, ప్రమీల, జైపాల్ రెడ్డి, రాజిరెడ్డి, వరలక్ష్మి, విజయలక్ష్మి, చక్రపాణి, పద్మ, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీ రెడ్డెమ్మ దేవస్థానంలో రేపు బహిరంగ వేలంపాటలు

గుర్రంకొండ, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):



అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామంలోని శ్రీ రెడ్డెమ్మ దేవత దేవస్థానానికి సంబంధించిన వివిధ వ్యాపార హక్కుల కేటాయింపునకు శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నవంబర్ 7వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ వేలం ప్రక్రియ జరగనుంది. దేవస్థానానికి సంబంధించి టీ, టిఫిన్ హోటల్ నిర్వహణ, పూజా సామగ్రి, కొబ్బరికాయలు, పూల విక్రయాలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్ విక్రయాలు, వాహనాల పార్కింగ్ టోల్‌గేట్ నిర్వహణ, అమ్మవారి వస్త్రాల సేకరణ, లామినేషన్ ఫొటోలు, బొమ్మల విక్రయ హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ రాజన్న నాయుడు, ఈఓ మంజుల తెలిపారు. వేలంపాటలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు రూ.10 వేల ధరావతు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు నిర్ణీత సమయానికి ఆలయానికి చేరుకుని వేలంపాటలో పాల్గొనాలని చైర్మన్, ఈఓ కోరారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా వ్యవహరించాలి





అమలాపురం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్)

జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఆర్. మహేష్ కుమార్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఓటు రహస్యాన్ని తప్పనిసరిగా కాపాడాలని, ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. శుక్రవారం అమలాపురం జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో కౌంటింగ్ సిబ్బంది, సూపర్వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల వేర్పాటు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, కౌంటింగ్ హాళ్ల నిర్వహణ, అభ్యర్థులు, ఏజెంట్లకు సంబంధించిన నిబంధనలు, పోలీసు భద్రత తదితర అంశాలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. కౌంటింగ్ నిర్వహణపై సందేహాలు ఉంటే ముందుగానే సంబంధిత రిటర్నింగ్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అమలాపురం నియోజకవర్గ పరిధిలోని పది మండలాలకు అమలాపురం పట్టణంలోని ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో, కొత్తపేట నియోజకవర్గానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విశ్వకవి వేమన డిగ్రీ కళాశాలలో, రామచంద్రాపురం నియోజకవర్గ పరిధిలోని మండలాలకు రామచంద్రాపురంలోని ఎస్.కె.జి.పి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రం, హాలు, టేబుళ్ల సంఖ్య, విధులు, రౌండ్ల నిర్వహణపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్‌లో ముందుగా ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి బ్యాలెట్ పేపర్‌ను జాగ్రత్తగా పరిశీలించి, చెల్లుబాటయ్యే ఓట్లు, చెల్లని ఓట్లను నిబంధనల ప్రకారం నిర్ధారించాలని, ప్రతి రౌండ్ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ హాళ్లలోకి అనుమతించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వసంత మాధవి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల గణాంకాలపై సందేహాలెందుకు? ప్రజలకు సమాధానం చెప్పాలి: బి.వి.రామ్

పోలింగ్ శాతం పెరుగుదలపై అధికారుల వివరణ కోరిన తెలుగు శక్తి అధినేత

మేయర్ వ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్లు ఉండకూడదని వ్యాఖ్య



విశాఖపట్నం, నవంబర్ 6 (సిటిజన్ టైమ్స్):

ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఓటింగ్ గణాంకాలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ప్రజల తీర్పును గౌరవించకుండా రాజకీయ విజయాల గురించి మాట్లాడటం సరికాదని, ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయమే కీలకమని పేర్కొన్నారు. జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల పోలింగ్ శాతంపై అధికారులు వెల్లడించిన వివరాల్లో స్పష్టత కొరవడిందని విమర్శించారు. తొలుత 51.4 శాతంగా ప్రకటించిన పోలింగ్ శాతం మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు ఐదు శాతం పెరగడంపై వివరణ ఇవ్వాలని కోరారు. గాజువాక, అగ్రంపూడి, పెందుర్తి, విశాఖ పశ్చిమ, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో నమోదైన ఓటింగ్ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. గత ఎన్నికలతో పోల్చినప్పుడు కూటమి అభ్యర్థులకు లభించిన ఓట్లలో తగ్గుదల కనిపిస్తోందని, ఈ పరిణామాన్ని ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశంగా భావించాలని అన్నారు. మూడు లక్షలకు పైగా ఓటర్లు కూటమిని వ్యతిరేకించారన్నది తమ రాజకీయ విశ్లేషణగా పేర్కొన్నారు. వైసీపీ ఓట్లలో పెద్దగా మార్పు లేకపోవడం, కూటమి ఓట్లలో తగ్గుదల నమోదవడం రాజకీయంగా చర్చించాల్సిన అంశమన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారన్న ఆరోపణలపై విచారణ జరపాలని, తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సందేహాలపైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఈ అంశాలపై తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. విశాఖలో భూవివాదాలు, మాఫియా కార్యకలాపాల ఆరోపణలు, రాజకీయ జోక్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా జీవీఎంసీ మేయర్ వ్యవస్థ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటుందా? లేక రాజకీయ ఒత్తిళ్లకు అనుగుణంగా పనిచేస్తుందా? అన్నది ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం, పదవులకంటే ప్రజల విశ్వాసం, వారి ఆకాంక్షలకు గౌరవం ఇవ్వడం ముఖ్యమని బి.వి.రామ్ పేర్కొన్నారు. ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తికి కారణాలను గుర్తించి పాలనలో అవసరమైన మార్పులు తీసుకురావాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డాక్టర్ పప్పూర్ నికుంజ్ తదితరులు పాల్గొన్నారు.

కోనసీమలో కౌంటింగ్‌కు భారీ భద్రత.. విజయోత్సవ ర్యాలీలపై నిషేధం



అమలాపురం, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కోనసీమ జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నవంబర్ 7న నిర్వహించనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ వేడుకలు, బాణసంచా కాల్చేందుకు ఎలాంటి అనుమతులు ఉండవని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు గుర్తింపు కార్డుల తనిఖీలు, ఫ్రిస్కింగ్ నిర్వహించనున్నారు. అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. జిల్లాలో సెక్షన్ 163, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఐదుగురికి మించి గుమిగూడరాదని, అనుమతి లేని సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదని ఎస్పీ హెచ్చరించారు. నవంబర్ 7న అమలాపురంలో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు, కొత్తపేటలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయని తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని, కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే మీడియా ప్రతినిధులు తప్పనిసరిగా అధికారిక అనుమతి పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల ఫలితాలపై అసత్య, విద్వేషపూరిత పోస్టులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినా, వాటిని ఇతరులకు షేర్ చేసినా సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూపు అడ్మిన్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు అభ్యర్థులు, రాజకీయ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు, ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా కోరారు.

పరిషత్ కౌంటింగ్‌కు పటిష్ట భద్రత.. 10 కేంద్రాల్లో మూడంచెల బందోబస్తు

అనకాపల్లి, నవంబర్ 06 (సిటిజన్ టైమ్స్):

జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ నెల 7వ తేదీన జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాల్లో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి మూడంచెల భద్రతను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ వెల్లడించారు. పోలైన బ్యాలెట్ పత్రాలను ఆయా నియోజకవర్గాలు, మండలాల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రంగా భద్రపరిచినట్లు తెలిపారు.



10 కేంద్రాల్లో కౌంటింగ్ ఏర్పాట్లు

అనకాపల్లి మండలం కొత్తూరులోని ఎ.ఎం.ఎ.ఎల్ కళాశాలలో అనకాపల్లి, బుచ్చయ్యపేట, మునగపాక, పరవాడ, కశింకోట, సబ్బవరం మండలాలకు కౌంటింగ్ నిర్వహించనున్నారు. చోడవరం మండలానికి గాంధీగ్రామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు తెనుగుపూడిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం (బాలురు)లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. నక్కపల్లి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. మాకవరపాలెం, నర్సీపట్నం, రోలుగుంట మండలాలకు పెదబొడ్డేపల్లిలోని డాన్ బాస్కో డిగ్రీ, పీజీ కళాశాలలో, కోటవురట్ల, గొలుగొండ, రావికమతం, నాతవరం మండలాలకు నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. వి.మాడుగుల, చీడికాడ మండలాలకు వి.మాడుగులలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలకు ఎలమంచిలి ఇండోర్ స్టేడియంలో, ఎలమంచిలి మండలానికి ఎస్.జి.ఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

24 గంటల నిఘా.. అనధికార ప్రవేశంపై ఆంక్షలు

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద 24 గంటల పాటు సీసీటీవీ నిఘా కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. పోలీసు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడంతో పాటు ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను కేంద్రాల పరిసరాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. భద్రతా ఏర్పాట్లను సంబంధిత డీఎస్పీలు, సబ్ డివిజనల్ పోలీసు అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్ల ద్వారా అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచనున్నారు. ప్రతి పరిణామాన్ని వీడియో, ఫొటోగ్రఫీ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లను తనిఖీ చేసి, ఎన్నికల సంఘం జారీ చేసిన గుర్తింపు కార్డులను ధ్రువీకరించిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు.

మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు

కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్లు, లాప్‌టాప్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఆడియో, వీడియో రికార్డింగ్ పరికరాలను అనుమతించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. కౌంటింగ్ సమయంలో కేంద్రాల వెలుపల ప్రజలు, కార్యకర్తలు గుంపులుగా గుమిగూడరాదని, అనుమతి లేకుండా షామియానాలు, పందిళ్లు వేయరాదని తెలిపారు. ఫలితాలు వెలువడిన అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద లేదా పరిసర ప్రాంతాల్లో విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషిద్ధమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ఫలితాలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వీకరించాలని, ఎలాంటి ఉద్రిక్తతలకు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

42 డివిజన్లలో కూటమి జెండా ఎగురవేస్తాం: ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

9,700 మందితో నిర్వహించిన సర్వేలో కూటమి ప్రభుత్వానికి సానుకూల స్పందన

రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికల్లో వంద శాతం విజయం సాధిస్తామని ధీమా

మేయర్ పదవి బీజేపీకి కేటాయించినా స్వాగతిస్తా

రాజమహేంద్రవరం, నవంబర్ 6 (సిటిజన్ టైమ్స్):

రానున్న రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో మొత్తం 42 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి వంద శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తామని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార వ్యూహాల వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కూటమి నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉంటారని తెలిపారు. శుక్రవారం తిలక్ రోడ్డులోని రెడ్డి కన్వెన్షన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో గత రెండున్నరేళ్లుగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు ఎమ్మెల్యేగా భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించిన సేవా కార్యక్రమాలపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు విస్తృత సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు. మొత్తం 9,700 మంది నుంచి అభిప్రాయాలు సేకరించగా, ప్రభుత్వ పనితీరుపై 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ఎమ్మెల్యేగా తన పనితీరుకు ప్రభుత్వ పనితీరు కంటే మరో ఏడు శాతం అధికంగా సానుకూల స్పందన లభించిందన్నారు. ప్రతి డివిజన్‌లో సగటున 200 మంది చొప్పున ప్రజలను కలిసి అభిప్రాయాలు సేకరించామని, 42 డివిజన్లలోనూ కూటమి పట్ల సానుకూలత కనిపిస్తోందని తెలిపారు. యువత పారిశ్రామిక, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధి, భవిష్యత్తులో రానున్న ఉద్యోగ అవకాశాలపై ఆశాభావంతో ఉన్నారని, వృద్ధులు కొత్త పెన్షన్ల మంజూరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

శాంతిభద్రతలు, మహిళల భద్రతకు ప్రాధాన్యం

గతంలో మహిళల భద్రత, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి విక్రయాలు, అల్లరిమూకలు, రౌడీయిజం వంటి సమస్యలను ప్రజలు ప్రధానంగా ప్రస్తావించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. వీటి పరిష్కారానికి 'మీ భద్రత.. మా బాధ్యత' కార్యక్రమం ద్వారా మహిళలతో నేరుగా చర్చించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలకు కృషి చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆయా సమస్యలపై ఫిర్యాదులు తగ్గాయని పేర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థలను మరింత మెరుగుపరచాలని ప్రజలు సూచించినట్లు చెప్పారు. ముఖ్యంగా 47, 48, 49 డివిజన్లలో అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు.

అభివృద్ధి పనులే ఎన్నికల్లో ప్రధాన అజెండా

నగరంలోని ప్రతి డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కరపత్రాలు రూపొందించి ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, ట్రాన్స్‌ఫార్మర్లు, పుష్కరాల పనులకు మంజూరైన నిధులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గోదావరి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, అమృత్ 2.0 పథకం ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, బొమ్మూరు హైవే సమీపంలో పది ఎకరాల స్థలంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను సమీకరిస్తున్నామని తెలిపారు. జాంపేటలోని లూథరన్ ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు భోజన వసతి కల్పించేందుకు దేవిచౌక్‌కు చెందిన వ్యాపారవేత్త శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో రూ.20 లక్షల వ్యయంతో శాశ్వత భోజనశాల నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.



కూటమి ఐక్యతే విజయానికి బలం

కార్పొరేషన్ ఎన్నికల్లో 42 డివిజన్లకు వందలాది మంది ఆశావహులు ఉన్నప్పటికీ అందరి లక్ష్యం కూటమి విజయమేనని స్పష్టం చేశారు. మేయర్ పదవిని బీజేపీకి కేటాయించినా స్వాగతిస్తానని, డిప్యూటీ మేయర్ పదవిపై కూటమి నాయకత్వం తీసుకునే నిర్ణయాన్ని గౌరవిస్తానని తెలిపారు. టికెట్ ఆశించి దక్కని నాయకులకు రాజకీయంగా తగిన అవకాశాలు కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా ప్రతి ఇంటికీ కనీసం రెండుసార్లు వెళ్లి ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో నియోజకవర్గంలో సుమారు 800 కొత్త పెన్షన్లు అందించామని, మరో ఐదు వేల పెన్షన్లు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సుమారు 8 వేల కొత్త రేషన్ కార్డులు అందించినట్లు తెలిపారు. గతంలో మ్యాపింగ్ విధానంలో ఎదురైన సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందేలా రానున్న రెండు మూడు నెలల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మత సామరస్యానికి పెద్దపీట

రాజమహేంద్రవరం మత సామరస్యానికి ప్రతీకగా కొనసాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్ని మతాల విశ్వాసాలను గౌరవిస్తూ రంజాన్, క్రిస్మస్, హిందూ పండుగల్లో అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతున్నామని తెలిపారు. నగరంలో ప్రతి ఒక్కరూ తమ మత విశ్వాసాలను స్వేచ్ఛగా ఆచరించే వాతావరణం కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. మొత్తం 42 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు పరస్పర సమన్వయంతో పనిచేస్తామని ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.



ఒక్కో వ్యాధికి ఒక్కో రకం వెల్లుల్లి

ఎన్నో వ్యాధులకు ప్రకృతి ప్రసాదించిన ఔషధంగా భావిస్తోన్న వెల్లుల్లిపై సరికొత్త పరిశోధనలు జరుగుతున్నాయి. వెల్లుల్లిలోని ఎలిసిన్.. అంటువ్యాధులు, శ్వాసకోశ రుగ్మతలపై పనిచేస్తుంది. గంధక ధాతువులు...అధిక రక్తపోటును, కొలెస్ట్రాల్‌నూ తగ్గిస్తాయి. సెలీనియం క్యాన్సర్ కణాలవ్యాప్తిని తగ్గిస్తుంది. ఫ్లేవనాయిడ్లు గుండె ధమనులను కాపాడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు మధుమేహం, వృద్ధాప్యం మీద పనిచేస్తాయని ఇప్పటికే శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, వెల్లుల్లికి ఉన్న ఈ సహజ రోగ నిరోధక లక్షణాలను నానో టెక్నాలజీతో మరింత ఇనుమడింపజేయవచ్చని అలహాబాద్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు కె.ఎన్.ఉత్తమ్ నిర్ధారించారు. ఆయన ఆధ్వర్యంలో పరిశోధకులు వెల్లుల్లి మొక్కపై టైటానియం డయాక్సైడ్ నానో పార్టికిల్స్‌ను ప్రయోగించారు. ఈ నానో అణువులు వెల్లుల్లిలోని పోషక వ్యవస్థను మరింత బలోపేతం చేశాయి. ఫలితంగా వెల్లుల్లిలో గంధకం, భాస్వరం, క్యాల్షియం, జింక్, ఇనుము ధాతువులు సాధారణం కన్నా ఎక్కువగా ఏర్పడ్డాయి. యాంటీ ఆక్సిడెంట్లు 30 నుంచి 40 శాతం పెరిగాయి. వెల్లుల్లిలోని ఏ ధాతువు ఏ వ్యాధి చికిత్సకు తోడ్పడుతుందో నిర్ధారించుకుని ఆయా రోగాల చికిత్సకు పరిశోధనశాలలో వేర్వేరు వెల్లుల్లి రకాలను రూపొందించి పొలాల్లో సాగు చేయించాలని ఉత్తమ్ బృందం యోచిస్తోంది. ఇలాంటి రకాలకు పేటెంట్లు తీసుకుని రెండేళ్లలో రైతుకు అందించాలనుకుంటున్నామని ఉత్తమ్ చెప్పారు.

హైబీపీతో గుండెకే కాదు...


కంటిచూపుకూ ముప్పు! వైద్యుల హెచ్చరిక

రక్తపోటును తేలిగ్గా తీసుకోవద్దు

రెటీనాలోని సున్నితమైన రక్తనాళాలను దెబ్బతీస్తున్న హైపర్‌టెన్షన్

బీపీని అదుపులో ఉంచుకోవడమే కళ్లను కాపాడుకోవడానికి మార్గం





అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) గుండె జబ్బులకు, పక్షపాతానికి దారితీస్తుందని మనందరికీ తెలుసు. అందుకే దానిని 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తారు. అయితే, నియంత్రణలో లేని బీపీ వల్ల కేవలం గుండెకే కాకుండా మన కంటిచూపునకు కూడా తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక రక్తపోటు నేరుగా కంటిలోని రెటీనాపై ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రెటీనా అనేది కంటిలో ఉండే అత్యంత సున్నితమైన కాంతి-గ్రహణ పొర. దీర్ఘకాలం పాటు బీపీ అదుపులో ఉంటే, రెటీనాలోని రక్తనాళాలపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ఫలితంగా ఆ రక్తనాళాలు దెబ్బతినడం, గట్టిపడటం లేదా కుచించుకుపోవడం జరుగుతుంది. ఈ పరిస్థితిని 'హైపర్‌టెన్సివ్ రెటినోపతీ' అని పిలుస్తారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ప్రారంభ దశలో దీని లక్షణాలేవీ బయటకు కనిపించవు. సమస్య ముదిరినప్పుడు దెబ్బతిన్న రక్తనాళాల నుంచి ద్రవాలు లేదా రక్తం లీక్ అవ్వడం మొదలవుతుంది. దీనివల్ల రెటీనాలో వాపు, దృష్టి మసకబారడం, కొన్ని సందర్భాల్లో పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. అంతేకాకుండా, హైపర్‌టెన్షన్ వల్ల దృష్టి నరం (ఆప్టిక్ నర్వ్) దెబ్బతినడం, రెటీనా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం (బ్లాకేజ్) వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చు. ఈ బ్లాకేజ్‌లు ఏర్పడటం అత్యవసర పరిస్థితి అని, వెంటనే చికిత్స తీసుకోకపోతే శాశ్వత అంధత్వం వస్తుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అందుకే 40 ఏళ్లు దాటిన వారు, ఇప్పటికే బీపీతో బాధపడుతున్నవారు తప్పనిసరిగా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జీవనశైలి మార్పులు, సరైన మందులతో

ఆరోగ్యం



ఒబేసిటీ సమస్య మందులతో పోయేది కాదు: డబ్ల్యూహెచ్ఓ

స్థూలకాయంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలిసారిగా మార్గదర్శకాలు

జీఎల్పీ-1 మందులు మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం

మందులతో పాటు ఆహార నియమాలు, వ్యాయామం కూడా ముఖ్యమనని సూచన

ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మరణాలకు కారణమవుతున్న స్థూలకాయం (ఒబేసిటీ) సమస్యపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఊబకాయం చికిత్సలో వాడుతున్న గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1 (జీఎల్పీ-1) రకం మందులు సమర్థవంతమైనవే అయినప్పటికీ, కేవలం వాటితోనే ఈ ప్రపంచ ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించలేమని సోమవారం విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేసింది. మందులతో పాటు జీవనశైలి మార్పులు కూడా అంతే ముఖ్యమని తేల్చిచెప్పింది. ప్రపంచవ్యాప్తంగా వంద కోట్లకు పైగా ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. పెద్దవారిలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 30 లేదా అంతకంటే ఎక్కువగా ఉండటాన్ని స్థూలకాయంగా పరిగణిస్తారు. దీని చికిత్స కోసం లిరాగ్లుటైడ్, సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ వంటి జీఎల్పీ-1 మందుల వాడకానికి డబ్ల్యూహెచ్ఓ షరతులతో కూడిన సిఫార్సులు చేసింది. ఈ మందులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటు బరువు తగ్గడానికి, గుండె, కిడ్నీ సమస్యల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. అయితే, ఈ మందులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ విపరీతంగా పెరగడంతో నకిలీ, నాణ్యతలేని ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తున్నాయని డబ్ల్యూహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది. "స్థూలకాయం ఒక దీర్ఘకాలిక వ్యాధి. దీనికి సమగ్రమైన చికిత్స అవసరం. కేవలం మందులతోనే ఈ సమస్యను అధిగమించలేం. అయితే, లక్షలాది మందికి చికిత్సలో జీఎల్పీ-1 మందులు ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడతాయి" అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ తెలిపారు. ఈ మందులు వాడే వ్యక్తులు తప్పనిసరిగా ఆరోగ్యకరమైన ఆహార నియమాలు, క్రమం తప్పని వ్యాయామం వంటి జీవనశైలి మార్పులను అనుసరించాలని, ఆరోగ్య నిపుణుల పర్యవేక్షణలో ఉండాలని గైడ్‌లైన్స్‌లో స్పష్టం చేశారు. స్థూలకాయం వల్ల గుండె జబ్బులు, టైప్-2 డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ఈ సమస్యకు పరిష్కార మార్గాలు కనుగొనకపోతే 2030 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఏటా 3 ట్రిలియన్ డాలర్ల భారం పడుతుందని అంచనా వేసింది.

చిన్నప్పటి వైరస్‌తో బ్లాడర్ క్యాన్సర్..

శరీర రక్షణే శాపమా?

చిన్నప్పుడు సోకే బీకే వైరస్‌తో బ్లాడర్ క్యాన్సర్ ముప్పు

వైరస్‌పై పోరాటంలో మన కణాల డీఎన్ఏ దెబ్బతింటున్న వైనం

యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ యార్క్ శాస్త్రవేత్తల పరిశోధన

వైరస్‌ను ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారణకు అవకాశం

చిన్నతనంలో సర్వసాధారణంగా సోకే ఒక వైరస్, భవిష్యత్తులో బ్లాడర్ క్యాన్సర్‌కు కారణం కావచ్చని యూకే పరిశోధకులు తేల్చారు. ఈ వైరస్‌ను ముందుగా గుర్తించి నియంత్రించగలిగితే, బ్లాడర్ క్యాన్సర్‌ను నివారించేందుకు ఒక కొత్త మార్గం దొరుకుతుందని యూనివర్సిటీ ఆఫ్ యార్క్ శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఈ అధ్యయన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధన ప్రకారం బాల్యంలో సోకే 'బీకే వైరస్' ఎలాంటి లక్షణాలు చూపించకుండా కిడ్నీలలో నిద్రాణంగా ఉండిపోతుంది. అయితే, ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు మన శరీరంలోని రక్షణ వ్యవస్థ చేసే పోరాటమే అసలు సమస్యకు కారణమవుతోంది. వైరస్‌పై దాడి చేసేందుకు ఉద్దేశించిన ఎంజైమ్‌లు, పొరపాటున మన శరీర కణాల డీఎన్ఏనే దెబ్బతీస్తున్నాయి. ఈ ప్రక్రియను పరిశోధకులు 'ఫ్రెండ్లీ ఫైర్'గా అభివర్ణించారు. ఇలా దెబ్బతిన్న డీఎన్ఏ కాలక్రమేణా క్యాన్సర్‌కు దారితీస్తుందని వారు కనుగొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సైమన్ బేకర్ మాట్లాడుతూ.. "సాధారణంగా సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటిలో వైరస్ డీఎన్ఏ మన జన్యుపదార్థంతో కలిసిపోయి కణితులు ఏర్పడటానికి కారణమవుతుంది. కానీ, బ్లాడర్ క్యాన్సర్ విషయంలో వైరస్‌పై మన శరీరం జరిపే ప్రతిస్పందనే డీఎన్ఏ మార్పులకు, తద్వారా క్యాన్సర్‌కు కారణమవుతున్నట్లు మా పరిశోధనలో తేలింది" అని వివరించారు. వైరస్ సోకిన కణాలతో పాటు వాటి చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణాల డీఎన్ఏ కూడా దెబ్బతింటున్నట్లు గుర్తించారు. చాలా ఏళ్ల తర్వాత బ్లాడర్ క్యాన్సర్‌ను గుర్తించే సమయానికి కణితులలో వైరస్ ఆనవాళ్లు ఎందుకు కనిపించవనే దానికి ఇది సమాధానం కావచ్చునని బేకర్ తెలిపారు. ప్రస్తుతం ధూమపానం మానేయడం ద్వారా బ్లాడర్ క్యాన్సర్‌ను నివారించాలని సూచిస్తున్నారు. తాజా పరిశోధన ఫలితాలు బీకే వైరస్‌ను నియంత్రించడం ద్వారా ఈ క్యాన్సర్‌ను నివారించేందుకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి.



చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున కాంబోలో మూవీ రాబోతోందా?





గత కొన్ని సంవత్సరాల నుంచి వీళ్ళ నలుగురిని కలిపి సినిమా చేయడానికి చాలామంది దర్శకులు ప్రొడ్యూసర్లు ఆసక్తి చూపిస్తున్నప్పటికి అది కార్యరూపం దాల్చడం లేదు.

గత 4 దశాబ్దాలుగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొని, తరాలు మారుతున్న బాక్సాఫీస్ వద్ద తిరుగులేని స్టార్లుగా వెలుగొందుతున్న నలుగురు దిగ్గజాలు చిరంజీవి,బాలయ్య, వెంకటేష్, నాగార్జున. ఇతర భాషల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకుని తెలుగు సినిమా ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర వహించారు. సీనియర్ హీరోలుగా గుర్తింపును సంపాదించుకున్న ఈ నలుగురు హీరోలు ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోలతో పోటీ పడుతున్నారు. ఇప్పటికీ వాళ్ల నుంచి వచ్చే సినిమాలు ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేయగలుగుతున్నాయి.

ైటర్లకి సవాలుగా మారిందా

త కొన్ని సంవత్సరాల నుంచి వీళ్ళ నలుగురిని కలిపి నిమా చేయడానికి చాలామంది దర్శకులు ప్రొడ్యూసర్లు సక్తి చూపిస్తున్నప్పటికి అది కార్యరూపం దాల్చడం లేదు. రణం ఏంటంటే ఈ నలుగురు ఇమేజ్ ను బ్యాలెన్స్ స్తూ ఒక కథని రాయడం అనేది అసాధ్యం. ఒకరి ్యారెక్టర్ కి ఇంపార్టెన్స్ పెరిగితే మరొకరి కి ప్రాధాన్యత గ్గిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ఆ థను హ్యాండిల్ చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని ఇప్పటికే చాలామంది రైటర్లు ప్రయత్నించి వదిలేసారు...

ఈ నలుగురిని కలిపే దర్శకులు ఉన్నారా?

ప్రస్తుతం ఇండస్ట్రీలో ఈ నలుగురితో సపరేట్ గా సినిమాలను చేస్తున్న దర్శకులు ఉన్నారు. కానీ వీళ్ళను కలిపి సినిమాలను చేయగలిగే దర్శకులు ఎవరున్నారు అనే దోరణిలో కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలో రాజమౌళికి ఈ నలుగురిని హ్యాండిల్ చేసే కెపాసిటి ఉంది. కానీ ప్రస్తుతం ఆయన వరల్డ్ సినిమా స్థాయికి వెళ్తున్నాడు. కాబట్టి ఈ నలుగురితో సినిమా చేయడం కష్టమనే చెప్పాలి.

ఇక తమిళ్ సినిమా ఇండస్ట్రీ విషయానికి వస్తే రీసెంట్ గా 'జైలర్ 2' సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించిన నెల్సన్ కి సైతం ఈ నలుగురి ఇమేజ్ ను హ్యాండిల్ చేస్తూ సక్సెస్ ని సాధించగలిగే కెపాసిటి ఉంది. కానీ దానికి తగ్గట్టు కథ దొరకాలి. అలాంటి కథని కనుక రాసుకోగలిగితే మాత్రం నెల్సన్ ప్రతి ఒక్కరి ఇమేజ్ కి తగ్గట్టుగా వాళ్ళను డిఫరెంట్ స్టైల్ లో చూపించే ప్రయత్నం చేస్తాడు. జైలర్ 2 రజనీకాంత్ ను డిఫరెంట్ గా ప్రజెంట్ చేస్తూ, భారీ లెవెల్లో ఎలివేట్ చేస్తూ ప్రతి ఒక్కరిని మంత్రముగ్ధుల్ని చేశాడు...

సెహ్వాగ్ తనయుడి విధ్వంసం.. అండర్-19 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం

నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

ఆర్యవీర్ సెహ్వాగ్ 70 పరుగులతో అజేయ ఇన్నింగ్స్

కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీకి అర్ధశతకం

ఇషాన్ సూద్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు

ఆదివారం పాకిస్థాన్‌తో భారత్ తదుపరి మ్యాచ్



అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (70 నాటౌట్), కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ (53 నాటౌట్) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. తొలుత బౌలర్లు నేపాల్‌ను 128 పరుగులకే కట్టడి చేయగా.. భారత ఓపెనర్లు లక్ష్యం చిన్నదిగా మార్చేశారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు ఇషాన్ సూద్ అదిరిపోయే ఆరంభం అందించాడు. కొత్త బంతితో స్వింగ్ రాబడుతూ నేపాల్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. 10 ఓవర్లలో నాలుగు మెయిడిన్లతో కేవలం 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో నేపాల్ టాపార్డర్ కుప్పకూలింది. దర్శ్ సోనార్ (43) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆశిష్ లుహార్ (29)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే వీరి భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాక నేపాల్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు త్వరగానే పెవిలియన్ చేరారు. అర్జున్ రాజ్‌పుత్ 3, యశ్వీర్ గౌడ్ 2 వికెట్లు తీయడంతో నేపాల్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది.స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆర్యవీర్, లక్ష్య రాయ్‌చందానీ అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. తొలి కొన్ని ఓవర్లు ఆచితూచి ఆడిన ఈ జోడీ.. ఆ తర్వాత బౌండరీలతో విరుచుకుపడింది. ముఖ్యంగా నేపాల్ స్పిన్నర్లపై ఆర్యవీర్ ఎదురుదాడికి దిగాడు. క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లు ఆడుతూ కేవలం 34 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు లక్ష్య రాయ్‌చందానీ స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అతడు 59 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరకు భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 129 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.ఈ గెలుపుతో 'గ్రూప్-ఏ'లో భారత్ రెండు పాయింట్లతో అగ్రస్థానానికి చేరింది. నెట్ రన్‌రేట్ 4.170గా నమోదైంది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.

కోహ్లీ 100 సెంచరీల కల నెరవేరేనా?

2027 ప్రపంచకప్ లోపు కష్టమంటున్న మాజీ కోచ్!

- ఈ ఘనత సాధించడం కష్టమేనన్న అభిషేక్ నాయర్
- ప్రపంచకప్ తర్వాత ఆడినా అతడి ఆటతీరు ఎలా ఉంటుందో అని సందేహం
- వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు
- హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలన్న నాయర్
- బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం అని వ్యాఖ్య



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమేనని భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోహ్లీకి తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వరకు ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వంద సెంచరీల మార్కును అందుకోవడానికి సరిపడా మ్యాచ్‌లు లేవని జియోస్టార్‌తో చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీ 86 సెంచరీలు చేశాడు.భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి నాయర్ ఈ అంశంపై చర్చించాడు. "కోహ్లీ వంద సెంచరీలు చేయాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే తగినన్ని మ్యాచ్‌లు ఆడాలి కదా! ప్రపంచకప్ తర్వాత కూడా అతడు ఆడొచ్చు. అయితే అప్పటికి అతడి స్ఫూర్తి ఇదే స్థాయిలో ఉంటుందా అన్నది చెప్పలేం. అందుకే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమని భావిస్తున్నా" అని నాయర్ వివరించాడు.వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో 55 శతకాలు బాదాడు. గతంలో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 49 సెంచరీల రికార్డును అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తన 50వ వన్డే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు.ఇదే చర్చలో భారత జట్టు భవిష్యత్తు కూర్పుపైనా నాయర్ కీలక సూచనలు చేశాడు. హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి పర్యటనల్లో ఇద్దరు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉంటే సమతూకం మెరుగవుతుందని చెప్పాడు. ఇద్దరు ప్రధాన పేసర్లతో పాటు బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం చేకూరుతుందని వివరించాడు.మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నితీశ్ కుమార్ రెడ్డిని ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని పుజారా సూచించాడు. హార్దిక్ అందుబాటులో ఉంటే అతడే తొలి ఎంపిక అని, అయితే ఏడాది పొడవునా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండలేకపోతున్నందున సమాన సామర్థ్యాలున్న మరో ఆటగాడు అవసరమని పేర్కొన్నాడు.వన్డే క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెంచేందుకు మల్టీ ముక్కోణపు, నాలుగు దేశాల టోర్నీలను నిర్వహించాలని నాయర్, పుజారా అభిప్రాయపడ్డారు. మూడు, నాలుగు జట్లు పాల్గొనే టోర్నీల్లో ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుందని, ఆటగాళ్లను ఎక్కువగా చూసే అవకాశం అభిమానులకు లభిస్తుందని పుజారా చెప్పాడు. ఇలాంటి పోటీలు పెద్ద టోర్నీలకు జట్లను సిద్ధం చేయడంతో పాటు వన్డే ఫార్మాట్‌పై ఆసక్తిని పెంచుతాయని నాయర్ పేర్కొన్నాడు. షార్జాలో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ వంటి జ్ఞాపకాలు ఇలాంటి టోర్నీలతోనే ముడిపడి ఉన్నాయని గుర్తుచేశాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776